తెల్లవారింది. గడియారం ఏడు గంటలు కొట్టింది.

న్యూయార్క్‌లోని పదహారంతస్థుల భవనంలో పదవ అంతస్థులో, రెండవ నెంబర్ రూమ్‌లో నిద్రపోతున్న రావ్ ఉలిక్కిపడి లేచాడు.

కళ్ళు నులుముకొని గడియారం కేసి చూశాడు. గడియారం ఏడు గంటలు చూపుతోంది.

గబగబ మంచం దిగాడు. అలవాటు ప్రకారం కిటికీ దగ్గర నిలబడి బయటకు చూశాడు.

చలికాలం తెల్లగా మంచు కురుస్తోంది. చెట్లు, చేమలూ తెల్లగా అస్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ చలిలో అప్పుడప్పుడూ కారు హారన్లు మాత్రమే వినిపిస్తున్నాయి. నగరం ఇంకా నిద్రమత్తులోనుండి లేవలేదు.

కొంచెంసేపు అలాగే నిలబడి వెను దిరిగాడు.

టవలూ, బ్రష్షూ, పేస్టూ, సోపూ తీసుకొని బాత్ రూమ్‌లోకి వెళ్ళాడు.

అతనికి నీరజ జ్ఞాపకం వచ్చింది. 'ఇప్పుడేం చేస్తుంటుంది? నాలాగే ముఖం కడుక్కుంటూ నా గురించి ఆలోచిస్తూ, పరధ్యాన్నంగా ...' టప్ మని శబ్దం చేస్తూ చేతిలోని సోపు పెట్టె జారి క్రింద పడింది. బాహ్య ప్రపంచంలోకి వచ్చి సోపు పెట్టె అందుకున్నాడు.

* * *

"పోస్ట్" అన్న శబ్దంతోపాటే కాలింగ్ బెల్ మోగడంతో కాఫీ సిప్ చేస్తున్న రావ్ లేచి వెళ్ళి తలుపుతీసి ఉత్తరం అందుకున్నాడు. కవరు చాలా బరువుగా ఉంది. కవరుకున్న నారింజ పండు రంగు చూడగానే అది ఎవరు రాశారో అతని కర్థమైపోయింది. తలుపు దగ్గరగా వేసి వెను దిరిగి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. కవరు చింపి లోపలున్న కాగితాలు బయటకు లాగాడు.

'ఇంత చాటభారతం ఏం వ్రాసిందబ్బా నీరజ?' అనుకుంటూ చదవడం ప్రారంభించాడు.

ముత్యాల్లాంటి అక్షరాలు.

హైదరాబాదు,
శుక్రవారం.

మై డియర్ రావ్! ఇక్కడంతా కులాసా. నీవు క్షేమమని తలుస్తాను.

నేను నీకు ఉత్తరం వ్రాసి చాలా రోజులయింది. కదూ?

అందుకు నన్ను మనసుస్ఫూర్తిగా క్షమిస్తావని ఆశిస్తున్నాను. నీవులేకుండా క్షణ మొక యుగంగా గడుపుతున్నాను. లో[illegible] గడగడం కష్టమైపోతోంది. నిజానికి నీవు వెళ్ళి నాలుగు నెలలే అయినా, నాకు నాలుగు యుగా లయినట్లుగా ఉంది.

నేను పరధ్యానంగా ఉండడం చూసి అన్నయ్య నన్ను ఆట పట్టిస్తున్నాడు. రావ్! నీ ఒడిలో తలపెట్టుకొని కమ్మటి కలలు కనాలనీ, నీ గుండెల్లో వాలిపోయి పూర్ణచంద్రుణ్ణి చూస్తూ పరవశించాలనీ, చల్లని నీ చిరునవ్వు నా హృదయానికి అమృతపు జల్లులా సోకుతూంటే నీ నీలి కళ్ళలో కనిపించే కోటి కాంతుల కొంటెదనాన్ని చూస్తూ, హిమ బిందు వంటి నీ అధరాల స్పర్శ నీ లేత బుగ్గల్ని తాకుతూంటే అలా మన మిద్దరమూ నీలి మేఘాల్లో తేలిపోతూ అనురాగపు టంచుల్ని తాకాలని ఆత్రంగా ఉంది రావ్.

కవిత్వం చెప్పేస్తున్నాను కదూ? నీకు బోర్ కొడుతుందేమో కాని, రావ్, నేను వ్రాసింది ఆఖరు వరకు చదివి నన్ను అర్థం చేసుకుని, తప్పకుండా క్షమిస్తావనే విశ్వాసంతో వ్రాస్తున్నాను.

సరిగ్గా రెండు నెలల క్రితం :

మా కళాశాలలో "సైన్సు ఎగ్జిబిషన్" పెట్టారు. దానిలో అనేక మంది

## చలసాని అమరేంద్ర

యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నేను చూడడానికి వెళ్ళాను. సైన్సుకు సంబంధించిన విజ్ఞానం తలా ఒక రకంగా అందజేశారు.

ఆఖరున బి. కాం. ఫైనలియర్ చదువుతున్న విద్యార్థి సురేంద్రకు ప్రథమ బహుమతి అందజేస్తామని ఎనౌన్స్ చేశారు. సన్మానం ఫలానా తేదీన జరుగుతుందని చెప్పారు.

* * *

ఆ రోజు సురేంద్రకు సన్మాన సభ. పుర ప్రముఖులు కొంతమంది వచ్చారు.

సభ ముగిసిన తరవాత జిల్లా కలెక్టరు గారు అతనికి ఏదో సైన్సు పరికరాల పెట్టె బహూకరించి, బంగారు పతకంతో సన్మానించారు. చప్పట్లు మిన్నంటాయి.

అందరూ వెళ్ళిపోయిన తరవాత అతన్ని కలుసుకుని నా అభినందనలు తెలియజేశాను.

"మీలాంటి వారు కళాశాల కొకరున్నా చాలు. దేశం బాగుపడిపోతుంది" అన్నాను.

అతను నవ్వాడు. కళ్ళల్లో ఏదో మెరుపు. నేను అబ్బురపడ్డాను.

"థాంక్స్" అని అందరికీ చెప్పి సెలవు తీసుకున్నాడు.

ఆ మరునాడు పేపరులో భారత కళాభివృద్ధి సంఘం తరఫున జరిగిన చిత్రకళ పోటీ ఫలితాలు ప్రకటించారు. ప్రథమ బహుమతి ఆర్. సురేంద్ర అడ్రసు చదివాను.

అతనే అయి ఉంటాడు—సందేహం లేదు. పేజీ తిప్పాను. అతని ఫోటో చూడగానే క్షణం సేపు నిర్ఘాంత పోయాను.

ఫోటో కింద వివరాలు తెలుపబడ్డాయి. నా మనస్సెందుకో అతని పరిచయం కోసం తహతహలాడింది. నాకు తెలియకుండానే అతని మీద గౌరవం ఏర్పడి పోయింది.

( ఇలా వ్రాస్తున్నానని కోపం తెచ్చుకోకు, రావ్! )

కళాశాల పదిహేడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థి, విద్యార్థినులు ఎన్నో ప్రోగ్రాములు నిర్ణయించుకొని ఆ రోజున ప్రదర్శించారు.

వాటిలో సురేంద్ర 'ధుర్యోధన—ఏకపాత్రాభినయం' చేసి అందరినీ మెప్పించి, అందరి మన్ననలు పొందాడు. ( ఒక్క వ్యక్తిలో ఇన్ని కళ లుండడం అదృష్టం కాదా రావ్? ) ప్రదర్శనలు ముగిసిన తరవాత అతను గ్రీన్ రూమ్‌లోనుండి బయటకు వస్తుంటే కలుసుకున్నాను.

"చాలా బాగా చేశారండీ" అన్నాను.

"థాంక్యూ వెరీ మచ్. మీలాంటి కళాభిమానుల ప్రోత్సాహం ఉంటే ఇంకా ప్రగతిలోకి రాగలను" అన్నాడు నవ్వుతూ.

"షూర్, షూర్" అన్నాను, అంతకంటే ఏమనాలో తెలియక.

"మీ పేరు" ... అంటూ ఆగాడు.

"నీరజ."

"నా పేరు తెలుసనుకుంటా" అన్నాడు.

నేను చటుక్కున తల ఎత్తాను. అతని కళ్ళల్లో గర్వం లేదు. నిశ్చలంగా, ప్రశాంతంగా మెరుస్తున్నాయి.

తల ఊపాను.

"కాంటీన్‌కి వెళదాం వస్తారా?" అడిగాడు.

"అబ్బే ఇప్పుడెందుకు లెండి?" అన్నాను.

"మీరు మొహమాట పడుతున్నట్లున్నారు. ఫరవాలేదు పదండి" అంటూ దారి తీశాడు.

అతన్ని అనుసరించక తప్పిందికాదు.

ఇద్దరం వెళ్ళి ఓ టేబుల్ ముందు కూర్చున్నాం.

అతను నాటకరంగంలో తన అనుభవాలు చెప్తున్నాడు. మధ్య మధ్యలో నా అభిప్రాయాల్ని అడుగుతున్నాడు. నేను నవ్వి ఊరుకున్నాను.

అతను చాలా కలుపుగోలు వ్యక్తిగా కనిపించాడు. మనిషి చాలా నిదానస్తుడిలా కనిపించాడు.

కాస్సేపటి పరిచయంలో నన్నో ఆప్తురాలిగా భావించి తన స్వంత విషయాలు చెపుతున్న అతని వేపు ముగ్ధురాలినై చూస్తుండిపోయాను.

కొంచెంసేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్న తరవాత, "వస్తానండి" అని చేతులు జోడించి వెళ్ళిపోయా డతను.

రోజులు యాంత్రికంగా గడిచిపోతున్నాయి.

ఓ రోజు నేను, పక్కింటి లలిత సెకండ్ షో పిక్చర్‌కి వెళ్ళాం. సినిమా వదిలే సమయానికి కారు పంపుతానని చెప్పిన నాన్నగారు కారు పంపలేదు. ఒక పావు గంట కారుకోసం ఎదురుచూసి విసుగెత్తి, కాలినడకన ఇంటికి బయలు దేరాం.

ఇంటికి సినిమా హాలు ఎక్కువదూరం లేకపోవడం వల్ల కాలినడకన వెళ్ళడానికి సాహసించాము.

నెహ్రూ పార్కు సందు దగ్గరికి వచ్చేసరికి ఓ వ్యక్తి మా ఎదురుగా వచ్చాడు.

మమ్మల్ని చూడగానే విజిల్ వేశాడు. ఎక్కణ్ణుంచో ఇంకో వ్యక్తి వచ్చి మొదటి వాడితో కలిశాడు, వాళ్ళిద్దరూ మాకు దగ్గరగా వచ్చారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. అప్పుడప్పుడు గ్రామ సింహాలు మేమున్నామంటూ తెలియజేస్తున్నాయి.

"బలే పసందుగా ఉన్నాయిలే పిట్టలు" అన్నాడు ఒకడు నా చేయి పట్టుకొని లాగుతూ.

నేను కెవ్వున అరిచాను.

వాడు టక్కున నా నోరు మూశాడు.


ఇంకొకడు లలిత మీద పడబోయేంతలో అది కూడా గట్టిగా అరిచింది. రెండో వాడు లలిత మీదకు లంఘించాడు.

ఈ లోపల ఎవరో పరుగెత్తుకు వస్తున్నట్లు అడుగుల చప్పుడు విని వాళ్ళు మమ్మల్ని విడిచిపెట్టి పారిపోయారు.

మేము తేలిగ్గా ఊపిరి పీల్చుకుని మనస్సులోనే భగవంతునికి కృతజ్ఞతలు తెలుపుకున్నాం.

పరిగెత్తుకు వస్తున్న వ్యక్తి మా దగ్గరకు వచ్చాడు. ఆశ్చర్యం. అతను సురేంద్ర.

మమ్మల్ని చూడగానే అతమా[illegible] పరిస్థితికి లోనయి ఉం[illegible]





ఆలోచన          చిత్రం — ఎ. మాణిక్యరావు (చిత్రకళాకార్)

"మీరు... మీరేనా కేకలువేసింది?" అడిగాడు.

జరిగింది చెప్పింది.

"ఇవాళ చాలా పెద్ద గండం గడిచింది. మీరు రాకపోతే మా గతి ఏమ్యుండేదో?" అన్నాను, భయంతో సన్నగా వణుకుతూ.

"నేనూ మీలాగే సినిమాకు వెళ్ళి వస్తున్నాను. మీ కేకలు వినిపిస్తే ఇటు పరిగెత్తుకు వచ్చాను. పదండి మిమ్మల్ని ఇంటి దగ్గర దిగబెడతాను" అని అడుగు ముందుకు వేశాడు.

ఇల్లు దగ్గరకు రాగానే, "అదే మా ఇల్లు" అని చూపించాను.

"అయితే నేను వెళ్తాను. మీ రిక వెళ్ళండి" అని ఆగిపోయాడు.

"మీకు చాలా ఋణపడ్డాం. సమయానికి దేవుడిలా ఆదుకున్నారు" అన్నాను కృతజ్ఞతాపూర్వకంగా.

అతను నవ్వాడు. "నన్నెందుకో దేవుడిలా పొగిడేస్తున్నారు. నేనూ మీలాంటి మనిషినే. ఇంకెప్పుడూ ఇలా ఒంటరిగా రాకండి" అన్నాడు.

"ఇవ్వాళ జరిగింది చాలు. ఇక ప్రతిజ్ఞగా ఇలాటి పనులు చేయను" అన్నాను.

అతను వెళ్ళిపోయాడు.

• • •

ఆ రోజు నాన్నగారు కాలేజీకి కారు పంపలేదు. ఇలా అప్పుడప్పుడూ నాన్నగారికి కారు పంపడం పడదు. ఆయనకు ఏవో అర్జెంటు పనులుంటాయి.

బస్‌లో వెళ్ళటం నా కిష్టం లేదు!

మూడో నంబర్ బస్ స్టాండ్ దగ్గర నిలబడి బస్ కోసం ఎదురుచూస్తున్నాను.

అరగంట గడిచిపోయింది. బస్ రాలేదు. విసుగ్గా ఉంది.

"నమస్కారమండీ!"

వినయంతోగూడిన పురుష కంఠం విని ఉలిక్కిపడి తల త్రిప్పాను.

నాకు కుడి ప్రక్కగా కొంచెం దూరంలో సురేంద్ర నిలబడి ఉన్నాడు. "నమస్కారం" అన్నాను, తత్తరపాటుతో చేతులు జోడించి.

"ఏమిటి బస్ కోసం వెయిట్ చేస్తున్నారా?" అడిగాడు.

"అవును" అన్నాను.

"ఏ బస్‌కోసం?" అడిగాడు.

"ఒకటో నంబరు" చెప్పాను.

"ఒకటో నంబరు అరగంట క్రితమే వెళ్ళిపోయింది. ఇంకొక ముప్పావు గంట వరకూ రాదు" అన్నాడు. అతని ఉద్దేశ్యమేమిటో అర్థం కాలేదు.

"ఫరవాలేదు. ఏనిమిదో నంబరు బస్సు అటే వెళుతుంది. దానిలో వెళ్తాను" అన్నాను.

"ఎనిమిది ఇవ్వాళ రాదు" అన్నాడు నవ్వుతూ. నవ్వుతున్నప్పుడు అతనికళ్ళలో ఏదో మెరుపు తళుక్కు మన్నది.

"ఏం?" అడిగాను ఆశ్చర్యంగా.

"అది షెడ్‌లో ఉంది."

"మీ కెలా తెలుసు?" అడిగాను ఇంకా ఆశ్చర్యంగా.

"నేను అటునుండే వచ్చాను. వస్తూ ఉంటప్పుడు షెడ్లో కనబడింది."

నన్ను ఒక్కసారిగా ఎక్కడలేని నీరసం ఆవహించింది.

"ఏమిటి దిక్కు. ఇంకా ముప్పావు గంట వరకూ ఇలా నిలబడవలసిందేనా?' అన్నట్లు చూశాను అతనివేపు.

అతను నా బాధ గ్రహించినట్లున్నాడు. "మీకు అభ్యంతరం లేకపోతే మా ఇంటికి వెళదాం రండి దగ్గర్లోనే ఉంది" అన్నాడు.

"ఇప్పుడా?" అన్నాను తడబడుతూ.

"ఇంకా ముప్పావు గంటవరకూ ఇక్కడ ఎలా నిలబడగలరు? ఇక్కడకు దగ్గర్లోనే ఉంది. అరగంటలో వచ్చేయ వచ్చు పదండి" అన్నాడు.

అతడంత బలవంతం చేస్తున్నప్పుడు వెళ్ళకుండా ఉండడం సభ్యత కాదని పించింది. 'సరే' ననక తప్పిందికాదు.

అతను ఉత్సాహంగా ముందు దారి తీశాడు. నేను అనుసరించాను.

ఓ ఫర్లాంగు నడిచిన తర్వాత గాంధీ రోడ్డు ప్రక్కనున్న సందులోకి దారి తీశాడు.

అది విశాలమయిన ప్రాంతం. పెద్ద పెద్ద ధనవంతు లుండే ప్రాంతం. మనుషులు ఎదురుగా తప్పితే సంచరించరు.

అతను కొంతదూరం నడిచి ఒక ఇంటి ముందు ఆగాడు. జేబులోనుండి తాళం చెవి తీసి తలుపు తాళం తీశాడు.

తలుపులు తీసి లోపలికి అడుగుపెట్టి, "రండి" అన్నాడు, బయట భయం భయంగా చూస్తున్న నన్ను.

నేను లోపలి కడుగు పెట్టి బిత్తరపోయి నిల్చుండిపోయాను, అదొక చిన్న రూము. సామానంతా నీట్‌గా సర్ది ఉంది. ఓ మంచం, టేబిలు, కుర్చీ, సోఫా ఉన్నాయి.

"ఏమిటి చూస్తున్నారు?" అడిగాడు నవ్వుతూ.

"మీ ... మీరు ఇల్లన్నారు?" అన్నాను తడబడుతూ,

"మరి ఇది ఇల్లు కాక బజారా?" అదే కొంటె నవ్వు.

"అహా! అది కాదు మీ కుటుంబ సభ్యులు అంటే మీ అమ్మగారూ, నాన్నగారూ ..."

"ఉన్నారు కాని, ఇక్కడ లేరు."

"ఎక్కడ?" అడిగాను. చెప్పాడు.

ఆశ్చర్యపోయాను. మా అక్కయ్య వాళ్ళు ఉన్న వీధిలోనే!

"మీ వాళ్ళు ఈ ఊళ్ళో ఉండగా మీ రిక్కడెందు కుంటున్నారు?" అడిగాను అర్థంకాక.

"ఇక్కడ చదువుకోడానికీ, చిత్రాలు గీయడానికీ ప్రశాంతంగా ఉంటుందని ఇది తీసుకున్నాను" అన్నాడు.

"మీ భోజనం వగైరా ..."

"అన్నీ అక్కడే. తీరిక వేళల్లో ఇక్కడకు వస్తుంటాను" అని, "కూర్చోండి" అన్నాడు.

సోఫాలో కూర్చున్నాను.

ఫ్లాస్కులో కాఫీ రెండు కప్పుల్లో పోసి తనొకటి తీసుకొని, నా కొకటి ఇచ్చాడు.

"అబ్బే ఇప్పుడు కాఫీ ఎందుకండీ ఇంటికి వెళతాను గదా?" అన్నాను.

"ఇంటికి వెళ్ళరని కాదు తీసుకోండి" అన్నాడు.

మౌనంగా అందుకొన్నాను.

కొంచెంసేపు అవీ ఇవీ మాట్లాడు కున్న తరవాత తను గీసిన చిత్రాలుతీసి చూపించాడు. చాలా చిత్రాలు ఉన్నాయి. ఎంతో బాగున్నాయి కూడా.

నాకు అన్నింటిలోకీ సీతారాముల పర్ణశాల దృశ్యం బాగుంది ఎంతో రమణీయంగా, కనుల కింపుగా ఉంది. పర్ణశాల—దాని ఎదుట సీతా రాములు పూల మొక్కల మధ్య ఉన్న దృశ్యం, వారిపైన రామచిలుక ఎగురుతున్న దృశ్యం, దూరంగా మాయలేడి, పురి విప్పి ఆడుతున్న నెమలి, రాముని భుజంపై వాల బోతున్న పావురాలు, చుట్టూ ఆడుకుంటున్న కుందేళ్ళు ఎంతో దివ్యంగా ఉంది చిత్రం.

"అది మీకు నచ్చినట్లుంది తీసుకు వెళ్ళండి" అన్నాడు సురేంద్ర, నేను ఏకాంతంగా చిత్రం వేపు చూస్తుండడం గమనించి.

"అహా! చిత్రం బాగుంటే చూస్తున్నాను" అన్నాను.

"మీకు బాగుంది కాబట్టే తీసుకు వెళ్ళమంటున్నాను" అన్నాడు.

"తరవాత మీరు బాధపడతారేమో?" అన్నాను నవ్వుతూ.

"బాగుంది. దీంట్లో బాధపడడానికేముంది? నా దగ్గర ఎవళ్ళకి నచ్చిన

చిత్రాలు వాళ్ళు పట్టుకుపోతుంటారు. ఆ చిత్రం మీకు నచ్చింది కాబట్టి మిమ్మల్ని తీసుకెళ్ళమంటున్నాను. మీరు తీసుకోకపోతే నేను బాధపడాల్సివస్తుంది. నా తృప్తికోసం తీసుకోవాలి మీరు'' అన్నాడు దృఢంగా.

కొంచెంసేపైన తరవాత ''టైమవుతోంది వస్తానండి'' అని చిత్రం తీసుకుని లేచి నిలబడ్డాను.

అతను కూడా నిలబడ్డాడు.

బయటకు వచ్చి తలుపు లాక్ చేసి బయలుదేరాడు. నాతో అతను బస్‌స్టాండ్ వరకు వచ్చాడు.

ఐదు నిమిషాల్లో బస్సు వచ్చింది.

''గుడ్‌బై. అప్పుడప్పుడూ కలుస్తూ ఉండండి'' అని వీడ్కోలు ఇచ్చాడు.

* * *

ఆ రోజు అక్టోబరు మూడవ తారీఖు. నా బర్త్ డే.

నా మిత్రుల్ని చాలా మందిని ఆహ్వానించాను. వాళ్ళలో సురేంద్రకూడా ఉన్నాడు.

సాయంకాలం ఆరు గంట లవుతూంది.

నేను మేకప్ చేసుకొని నిలువుటద్దం ముందు నిలబడి చూసుకొన్నాను. నాకు ఒక్కసారిగా నీవు జ్ఞాపకం వచ్చావు. కళ్ళలో నీళ్ళు కదలాడాయి.

''ఈ సమయంలో రావ్ ఉంటే ఎంత బావుండేది.''స్వగతంలా అనుకోబోయిన నేను, అప్రయత్నంగా పైకి అనేశాను.

అద్దంలో తలుపు దగ్గర అమ్మ కనిపించింది. నేను తడబడ్డాను. అమ్మ నా దగ్గరకు వచ్చి, ''పిచ్చి పిల్లా! పుట్టినరోజు పండుగ నాడు ఎందుకు కన్నీళ్ళు? ఇంకో ఎనిమిది నెలలు ఓపిక పట్టావంటే రావ్ వచ్చేస్తాడు'' అంది ఓదార్పుగా.

నా బుగ్గలు మందారాలైనాయి.

''అబ్బే అదేం లేదు'' అని ఎర్రబడిన బుగ్గలు దాచుకోవడంకోసం తల వాల్చేసి బయటకు వచ్చాను.


హాల్లో సురేంద్ర ఒక్కడూ కూర్చొని ఏదో మాగజైన్ తిరగేస్తున్నాడు.

''అందరికంటే మీరే ముందు వచ్చారే!'' అని నవ్వుతూ సోఫాలో కూర్చున్నాను.

గ్రే కలర్ పాంటు, నేవీ బ్లూ షర్ట్‌లో ఎంతో అందంగా ఉన్నాడు. (రావ్! నీవు నన్ను అనవసరంగా అపార్థం చేసుకో



**ఇటీవల అగ్నికి ఆహుతైన మద్రాసులోని 14 అంతస్తుల ఎల్.ఐ.సి. భవనం అగ్నిప్రమాద కారణాల్ని ప్రభుత్వం దర్యాప్తు జరిపిస్తున్నది.**



మిథునం ఫోటో — టి. ఎల్. నారాయణ (బొంబాయి-6)

వద్దు. నా హృదయాధి నేతవు నీవు. నా హృదయ కుహరంలో నీ కున్న స్థానం వేరెవరికీ ఉండదు. ఉండకూడదు.)

సురేంద్ర నవ్వాడు. కళ్ళల్లో నిప్పు టలా కాంతి తళుక్కుమంది.

"లేటయితే ఏదైనా శిక్ష వేస్తా లేమోనని భయంవేసింది" అన్నాడు కొంటెగా.

అతను అతి చనువు తీసుకుంటున్నా డేమో ననిపించింది నాకు. నే మాట్లాడ బోయేంతలో మా ఫ్రెండ్సు గోలచేస్తూ వచ్చి పడ్డారు.

వారికి సురేంద్రని పరిచయం చేశాను.

వాళ్ళ వెనుక మా అన్నయ్య ఇద్దరు స్నేహితుల్ని వెంట బెట్టుకు వచ్చాడు.

మా అన్నయ్యకు సురేంద్రను పరిచయం చేశాను. ఇద్దరూ కరచాలనం చేసుకున్నారు.

"ఐయామ్ వెరీ గ్లాడ్ టు మీట్ యూ" అన్నాడు అన్నయ్య.

సురేంద్ర నవ్వి ఊరుకున్నాడు.

కొంచెంసేపు కబుర్లు చెప్పుకున్నాక అల్పాహార విందు చేశాం.

ఒక్కొక్కరూ తాము తెచ్చిన ప్రెజెంట్సు ఇవ్వసాగారు.

సురేంద్రమాత్రం ఏమీ ఇవ్వలేదు.

తర్వాత అందరూ సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

ఆఖరున సురేంద్ర మిగిలాడు.

కొంచెంసేపు నాతో, అన్నయ్యతో కబుర్లు చెప్పి 'వస్తా' నంటూ లేచాడు.

నేను గేటు వరకు వెళ్ళాను.

"ఇవాళ చాలా మంచి రోజు. ఐ యామ్ వెరీ హాపీ టు డే" అన్నాడు సురేంద్ర, గేటు దగ్గర ఆగి.

నేను నవ్వి ఊరుకున్నాను.

చిరుగాలి వయ్యారంగా వచ్చి గిలిగింతలు పెడుతూ ఎదలో తీయనిభావాలు లేపుతూంది.

సన్నజాజి పూల వాసన హృదయాంతరాళాలలో ఎక్కడో దాగి ఉన్న మధురమైన కోరికల్ని తట్టి లేపుతూ ఉంది.

"నీరజగారూ! నా ఈ చిన్న కానుక స్వీకరించండి" అంటూ నా దగ్గరగా వచ్చాడు.

"ఏమిటది?" అన్నాను.

"ఏదో చిన్న కానుక" అని నా చేయి అందుకున్నాడు.

నా నరాలు జివ్వుమన్నాయి. రక్తం పరుగులు తీసింది.

నా చిటికిన వ్రేలికి బంగారు ఉంగరం తొడిగాడు.

"ఇది చూసుకున్నప్పుడల్లా నేను గుర్తు వస్తాను నీకు." అతని కంఠంలో మధుర భావన. "గుడ్ బై వస్తాను!" అని ముందుకు నడిచాడు.

అతను కనుమరుగయ్యే వరకు చూసి వెనుదిరిగాను.

• • •

కళాశాల ఆవరణ దాటి బయటి కొచ్చాను. కారుకోసం చుట్టూ కలియ జూశాను. ఎక్కడా కనబడలేదు.

పది నిమిషాలు ఎదురు చూశాను.

'ఇవ్వాళ కారు రాలేదేమిటబ్బా' అనుకున్నాను.

మబ్బులు కదులుతూ ఒకదా న్నొకటి కౌగలించుకొంటున్నాయి.

'వర్షం వచ్చేటట్లుంది. త్వరగా వెళ్ళిపోవాలి. ఏదీ ఇంకా కారు రాదేమిటి?' అనుకుని విసుగెత్తి కాలినడకన బయలుదేరాను.

బస్‌స్టాండ్ చేరుకునేసరికి మెల్లగా చినుకులు పడటం ప్రారంభించింది.

ఈ లోపల సైకిల్ వెనకాల బుక్స్ పెట్టుకుని వస్తున్న సురేంద్ర నన్ను చూశాడు.

"అరెరె ఇలా వర్షంలో నిలబడ్డారేమిటి? ఇవ్వాళ మీ కారు రాలేదా? పదండి మా ఇంటికి వెళదాం. ఇలాగే ఇక్కడ నిలబడితే తడిసిపోగలరు" అన్నాడు కంగారుగా.

"ఫరవాలేదులెండి వెళ్ళిపోగలను. కాసేపట్లో బస్సు వస్తుంది" అన్నాను.

"ఇంకో పావుగంటవరకూ బస్సు రాదు కదా! ఈ లోపల మీ పుస్తకాలు తడిసిపోతాయి. మీరు తల దాచుకోవడానికి ఏ షాపులోకి వెళ్ళినా, ఈ రోజుల్లో ఆడపిల్ల ఒంటరిగా సహాయంకోసం వస్తే ఎలా అల్లరి పెడతారో మీకు తెల్సుగా" అన్నాడు.

నేను అతని కళ్ళలోకి చూశాను. 'నేనంటే నమ్మకం లేదా?' అన్నట్లు చూస్తున్నాయి అతని కళ్ళు.

నేను మౌనంగా ఉండటం చూసి, "పదండి" అని దారితీశాడు. నేను అనుసరించాను.

గబగబా నడుస్తూ అతని రూము చేరుకున్నాము. అప్పటికే కొద్దిగా తడిశాము.

అతను తాళం తీసి సైకిలు లోపల పెట్టాడు.

"లోపలికి రండి." ఆహ్వానించాడు.

ఎగిసిపడే గుండెలతో లోపలికి అడుగు పెట్టాను.

"కూర్చోండి. బాగా తడిసిపోయినట్లున్నారు" అన్నాడు.

కూర్చున్నాక టవల్ నా చేతి కందించాడు.

"తల తుడుచుకోండి. లేకపోతే జలుబు చేస్తుంది." అతని కంఠం నిండా మార్దవం.

నేను కొద్దిగా చలించాను.

"మీరు కూర్చోండి—నేను వెళ్ళి కాఫీ పట్టుకొస్తాను" అని గొడుగు తెరిచాడు.

"ఈ వర్షంలో వెళ్ళకండి. ఇప్పుడు కాఫీ లేకపోతే మునుగుకుపోయిందేమీ లేదు" అన్నాను.

"కాని, నేను అలా అనుకోగలనా? ఇప్పుడే వస్తాను కూర్చోండి" అని వెళ్ళిపోయాడు.

నేను గది గోడలవైపు చూస్తూ కూర్చున్నాను. వర్షపు చినుకులు చేస్తున్న లయ మధురంగా వినవస్తోంది.

ఐదు నిమిషాల్లో తిరిగి వచ్చాడు.

కాఫీ రెండు కప్పుల్లో పోసి ఒకటి నా కందించాడు.

మౌనంగా అందుకొని ఖాళీ చేశాను.

కొంచెంసేపు లోకాభిరామాయణం మాట్లాడుకొన్నాము.

"ఏదైనా బొమ్మ వేయండి" అన్నాను నేను.

"వేయమంటారా?"

"వేయండి కాలక్షేపం జరుగుతుంది" అన్నాను.

లేచి వెళ్ళి బీర్వా తెరిచి కాన్వాసు బయటకు తీశాడు.

"కాన్వాసు మీద వేస్తారా?" అడిగాను.

తల ఊపి ఫ్రేము స్టాండుకు బిగించాడు.

కుంచెలు, రంగులు టేబిల్ మీద పెట్టి సరిగ్గా కలుపుకున్నాడు.

"ఏం బొమ్మ వేస్తారు?" అడిగాను క్యూరియాసిటితో.

"బొమ్మ వేసేవరకు చెప్పను" అని నవ్వుతూ స్కెచ్ గియడం ప్రారంభించాడు. నేను నిశ్శబ్దంగా చూస్తూ కూర్చున్నాను. సుమారు ముప్పావుగంట గడిచిపోయింది.

స్కెచ్ గీయడం పూర్తయింది.

అతను నెమదిరిని రుమాలుతో ముఖం అద్దుకున్నాడు.

"ఈ పాటికి అదేం బొమ్మో గ్రహించే ఉంటారు" అన్నాడు నవ్వుతూ.

"ఊహించ గలిగాను" అన్నాను నేనూ నవ్వుతూ.

"ఈ వర్షం తగ్గేట్టు లేదు" అన్నాడు బయటకు చూస్తూ.

ఐదు నిమిషాల తరవాత లేచి రంగులు వేయడం ప్రారంభించాడు.

మా మధ్య భయంకరమైన నిశ్శబ్దం నృత్యం చేస్తోంది.

దాదాపు చిత్రం పూర్తయింది.

ఒక వైపు కొండ, దాని పక్కన గల గల పారుతున్న సెలయేరు, ఇంకొకవైపు పచ్చని పచ్చికపై లేళ్ళ గుంపు, వాటి మధ్య రాధాకృష్ణులు—పూల ఉయ్యాలలో ఒకరి భుజంపై మరొకరు తల ఆనించి ఉయ్యాల ఊగుతూన్న దృశ్యం, నీలి మేఘాలపై పక్షులు ఎగురుతున్న దృశ్యం, కొండ పక్క నుండి సూర్యోదయం అవుతున్న దృశ్యం, వారి ప్రక్కనే పురి విప్పి ఆడుతున్న నెమలి... ఎంతో రమణీయంగా ఉంది చిత్రం. నేను మూగ పోయి చిత్రం వేపు చూస్తూండి పోయాను.

ఎదలో ఆ దృశ్యం అనంతకోటి జల ధారల పన్నీటి తుషారాలు విరజిమ్ము తూంది. నవరసభరితమైన మది తీయని భావలహరిలో పయనిస్తూంది.

నాగకన్యలా మెలిదిరిగి కూర్చున్న రాధ అందం వర్ణనాతీతం. నేత్రాలు అరమోడ్పుగా, అజ్ఞానంగా ఉన్న భావా లను తేటతెల్లమయ్యేట్లు వ్యక్తీకరిస్తున్నాయి. పెదవులు సుకుమారంగా దానిమ్మ గింజలా పవరపాలను చిమ్ము తున్న ట్లున్నాయి. నాసిక సవ్యసాచిలా విటారుగా నిలబడి ముఖాని కో వింత సొయగాన్ని అందిస్తూంది. తీర్చి దిద్దినట్లుగా చిన్న చుబుకం.

స్వర్గంలో ఉన్న అనుభూతి కల్గింది.

అణువణువునా చిత్రకారుని సామర్థ్యాన్ని నవాలు చేస్తున్నట్లుగా ఉంది పాలసముద్రం లాంటి రాధ అందం.

"నీరజా!"

ఉలిక్కిపడి చటుక్కున తల ఎత్తాను. అతని కళ్ళల్లో ఏదో కోరిక, నాకు వెన్నెముకలోనుంచి వణుకు పుట్టుకొచ్చింది.

గబుక్కున లేచి నిలబడ్డాను.

అతను నా చేయి పట్టుకున్నాడు.

"మర్యాదగా వదలండి" అన్నాను కోపంగా.

"ఊహూ" అని నవ్వి ద్మారగా లొక్కున్నాడు.

దాని పెట్టి కొట్టాను చెంపమీద. పళ్ళు కొరికాడు. "ఇవ్వాళ నిన్ను అను భవించి తీరుతాను" అని నా జాకెట్ చిరుగ చించేశాడు.

"నీచుడా! మర్యాద గల వాడివని నీ ఇంటికి వస్తే ఇలాంటి నీచమైన పని చేస్తావా?" అన్నాను గింజుకుంటూ.

అతను నన్ను ఆక్రమించుకోసాగాడు.

అతన్ని కసితీరా తిట్టాను, గింజుకున్నాను, తన్నుతున్నాను. కాని, లాభం లేకపోయింది.

ఆఖరుకి అతని పశుత్వానికి బలి అయిపోయాను.

అయిపోయింది. అంతా అయిపోయింది. నా జీవితం మలినమైంది.

నెల తరవాత లేడీడాక్టరు నాకు నెల తప్పిందని చెప్పింది.

నిలువునా కుప్ప కూలిపోయాను.


భగవాన్!!! ఏ నేరం చేశానని నాకీలా పతనం చేశావు? నే నిక ఎలా బ్రతకను? అని కుమిలి కుమిలి ఏడ్చాను.

ఏమిటి దారి? సురేంద్రని పెళ్ళి చేసుకోమని అడిగితే?

చేసుకుంటాడా? అయినా, ఆ నీచుణ్ణి పెళ్ళి చేసుకోమని అడుగుతానా? ఛీ, ఛీ అంతకంటే చావు నయం. వాణ్ణి చేసుకొని తన్నూ బ్రతికేకంటే ఈ ఊరినుండి దూరంగా పారిపోయి ఒంటరిగా జీవించడం మేలు అనుకొని ఒక నిశ్చయానికి వచ్చి ఎవ్వరూ చూడకుండా నాలుగు బట్టలు సూట్‌కేస్‌లో పడేసుకొని, నిశ్శబ్దంగా గేటు దాటాను. గేటు దాటుతుంటే నా కాళ్ళు వణికాయి.

'జీవితంలో ఒంటరిగా జీవించడానికి బయలుదేరుతున్నాను. ఒంటరిగా ఉన్న స్త్రీని గౌరవించే మనుషులు సంఘంలో బహు తక్కువ. నీడలేని ఆడదాన్ని ఈ సంఘం ఒక్కసారిగా చంపదు! పదునైన కత్తుల్లాంటి మాటలతో పొడిచి పొడిచి చిత్రవధ చేస్తుంది. అయినా, నేను బ్రతకాలి. ఎవరి కోసం? నా కడుపులో పెరుగుతున్న ప్రాణి కోసం, నా బిడ్డ కోసం నేను బ్రతకాలి. నా బిడ్డని పెంచి పెద్ద చేసి వ్యక్తిత్వం గల వ్యక్తిగా నిల బెట్టిననాడే నాకు తృప్తి' అనుకున్నాను.

• • •



పోలంకుంది... చిత్రం — పి. ఆంజనేయులు (కరీంనగర్)

ఇదీ కథ, రావ్!

తెల్లవారేసరికి తిరుపతిలో ఉంటాను. అక్కడ ఏడుకొండలవాడి దర్శనం చేసుకొని ఉద్యోగం కోసం బయలుదేర తాను. ఈ విశాల విశ్వంలో నా పొట్ట పోషించుకోవడానికి ఏదైనా ఒక్క ఉద్యోగం దొరక్కపోదు.

బాధగా ఉంది కదూ? తప్పదు, రావ్! జీవితంలో ఎన్నో ఒడుదుడుకులు వస్తూంటాయి. వాటన్నిటిని ధైర్యంగా ఎదుర్కొని సంఘంలో వ్యక్తిత్వం ఉన్న వ్యక్తిగా నిలబడాలి గానీ, భయపడి ఆత్మహత్య చేసుకోవడం పిరికితనం.

స్త్రీ ఎవర్నైనా ఒక్కసారే ప్రేమిస్తుంది, రావ్! ఒకర్ని ప్రేమించిన తరవాత ఇక మనసంటూ ఉండదు. స్త్రీ తన హృదయకుహరంలోని ప్రేమ కుసుమాన్ని ఒక్కరికే అర్పిస్తుంది. ప్రేమించిన వ్యక్తిని పెళ్ళాడలేని స్త్రీ జీవితం ధన్యమౌతుంది. యుగ యుగాల నుండి పురుషుని అహంభావమే జయిస్తూ వచ్చింది. ఈ నాడూ జయించింది.


స్త్రీ ఘోరంగా ఓడిపోతూనే ఉంది.

ఇక ఈ సంఘం మారదా? వ్యవస్థ మారదా? ఏ నాటికైనా స్త్రీ ఇలా ఓడిపోతూ ఉండవలసిందేనా? దీనికి అంతం అంటూ లేదా? నాకీ మలిన శరీరాన్ని నీ కర్పించి అనుక్షణం ఆత్మ వంచన చేసుకుంటూ జీవించలేను.

నాకూ ఓ వ్యక్తిత్వం అంటూ ఉంది.

దాన్ని గంగపాలు చేసి పురుషుని అహంభావానికి దాసోహం అనలేను.

క్షమించు. ఆవేశంతో ఏమేమో రాసేశాను.



**రాతిలో...** ఫోటో — జి. ఎల్. నారాయణ (బొంబాయి-6)

నా ఆఖరి కోరిక ఏమిటంటే నువ్వు పెళ్ళి చేసుకుని, బిడ్డా పాపలతో కళకళ లాడాలని ఆశిస్తున్నాను.

ఈ అభాగ్యురాల్ని మరిచిపోయి సుఖంగా జీవించు.

వ్యవస్థ పాదాల కిందపడి విషాదంగా నలిగిపోయి, కాలగర్భంలో కలిసిపోబోతున్న మన ప్రేమను మరిచిపో!

ఇక ఉంటా!

నీది కాలేకపోయిన నీరజ."

* * *

రావ్ ఉత్తరం చదవడం ముగించాడు.

అతని గుండెల్లో అగ్నిపర్వతాలు పేలుతున్నాయి.

నీరజ కనిపించకుండా వెళ్ళిపోయిందనుకుంటే అతనికి దుఃఖం ముంచుకొస్తుంది.

"నీరూ నా నీరూ! ఎందుకిలా చేశావ్? నాకు కావలిసింది శాశ్వతమయిన నీ మనస్సు గాని, తాత్కాలికమైన శరీరం కాదని తెలుసుకోలేక పోయావు.

నీవు లేని బ్రతుకు నాకు మాత్రం ఎందుకు? నిన్ను వెతుకుతాను. జీవితకాలమయినా సరే వేచి ఉంటాను!" అనుకొని లేచాడు రావ్.

* * *

ఏరోడ్రమ్‌లో విమానం ఆగగానే చకచక దిగి, టాక్సీలో ఇల్లు చేరుకొన్నాడు రావ్.

ఆలోచనలు తీగల్లా ముసురు కుంటున్నాయి.

తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. 'ఎలాగైనా సురేంద్రని పెళ్ళికి ఒప్పించాలి. సురేంద్రనీ, నీరజనీ ఒకటి చేయాలి. అప్పుడే తనకు సంతృప్తి' అనుకొన్నాడు.

గబ గబా స్నానం చేసి నీరజ ఇల్లు చేరుకొన్నాడు.

గేటు తెరుచుకుని లోపలికి వెళ్ళాడు. మునివేళ్ళతో తలుపు తట్టాడు. తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా నీరజ అన్న నరేష్ నిలబడి ఉన్నాడు.

"నువ్వా?" అని, "రా! లోపలికి రా" అన్నాడు.

నీరజ, రావ్ ఒకరి నొకరు ప్రేమించుకొని తమ విషయం పెద్దలకు చెప్పారు. ఇరుపక్షాలవారు ఒప్పుకొని తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు. రావ్‌కి సెలవు లేకపోవడంతో వచ్చే సంవత్సరానికి పెళ్ళి వాయిదా పడింది.

రావ్ లోపలికి అడుగు పెట్టాడు.

"కూర్చో" సోఫా చూపించాడు.

కూర్చున్నాక — "గౌరమ్మా! కాఫీ పట్టా" అని తనుకూడా వేరే సోఫాలో కూర్చున్నాడు.

"ఎప్పుడు వచ్చావు?" మామూలుగా అడిగాడు.

"పొద్దున వచ్చాను."

"కొంచెం సేపు రెస్టు తీసుకోకుండా ఇలా వచ్చావేం?"

రావ్ మాట్లాడలేదు.

"కోర్సు ఇంకా ఎన్ని నెలలుంది?" అడిగాడు సురేష్.

"ఎనిమిది నెలలు." చెప్పాడు రావ్.

"ఎలా ఉంది జీవితం?" విషాదంగా నవ్వుతూ అడిగాడు.

రావ్ తల ఎత్తి అతని ముఖంలోకి చూశాడు.

మనిషి బాగా చిక్కిపోయాడు. నల్లబడ్డాడు. కళ్ళ క్రింద నల్లటి చారలు ఏర్పడ్డాయి.

జీవం లేనట్లు నవ్వాయి రావ్ పెదవులు.

గౌరమ్మ కాఫీ తెచ్చింది. మౌనంగా అందుకొని కాఫీ సేవించాడు.

"నీరజ అన్ని విషయాలూ ఉత్తరం వ్రాసే ఉంటుంది, అవునా?" అడిగాడు. తాను గర్భవతి అయినట్లు వ్రాసింది గాని, కారకుడెవరో నరేష్‌కు తెలియదు.

రావ్ అవునన్నట్లుగా తల ఊపాడు.

కొంచెం సేపు మాట్లాడి వెళ్ళిపోయాడు రావ్.

రావ్ ఇంటికి వెళ్ళి తన గదిలో కుమిలి కుమిలి ఏడ్చాడు.

కన్నీరు కళపెళ లాడే లావాలా అతని చెక్కిళ్ళ మీదుగా జారిపోతూంది.

'ఏం చేయాలి? ఓహ్ విధి నన్ను ఎంత క్రూరంగా వంచించింది? భగవాన్! నా జీవితంలో ఎందుకిలా ఆడుకుంటున్నావు? జీవితాంతం ఇలా నీరజ కోసం పరితపిస్తూ జీవితానికో అర్థం అంటూ లేకుండా ఎలా బ్రతికేది?'

అంత పెద్దవాడయి ఉండికూడా నిస్సహాయంగా బేలలా వల వలా ఏడ్చాడు.

అతని అంతరాంతరాళల్లో గుబులుగా రేగిన దుఃఖం కన్నీళ్ళ రూపంలో వెలికి వస్తూంది.

విషాదం, సుఖం, సంతోషం ఇవి మూడు మానవ మనుగడకు సహజ పరిణామాలు.

రోదన ఆడదాని సొత్తు. మనసెంతో బలహీనపడితే గానీ మగవాడు ఏడవడు.

అతని వేదన, దుఃఖం గది నాలుగు గోడల మధ్య నిస్సహాయంగా నలిగింది.

ఎన్నో బంగారు కలలు, మధురమైన ప్రేమగీతికలు, మూగబాసలు చేసిన మది నిర్జీవమైన ఎడారిలా ఉంది.

'ఎల్లప్పుడూ శిశిరమే ఉండదు. వసంతం వస్తుంది' అన్న నీరజ మాటలు చెవుల్లో మారోమ్రోగుతున్నాయి.

'అవును వసంతం వస్తుంది. కలల్లో ఎప్పుడూ వస్తుంది.'

కాని, నిజ జీవితంలో మాత్రం అందని జాబిల్లిలా, ఎగిరే గువ్వలా, పరిగెత్తే చిరుగాలిలా ఊరిస్తూ ఉంటుంది.

నా జీవితంలో ఇక వసంతం లేదు. కాని, నేను నీరజ బాగుకోసం పాటుపడాలి. సురేంద్రను పెళ్ళికి ఒప్పించాలి. తరవాత నీరజను వెతకాలి' అనుకొని లేచాడు రావ్.

* * *

నీరజ వ్రాసిన ప్రకారం మూడో నెంబరు బస్‌స్టాండ్‌కి కొంచెం దూరంలో గాంధీబొమ్మ పక్కనున్న సందులో... నెంబరింటి ముందాగాడు. తాళం వేసి లేదు, దగ్గరగా వేసి ఉన్నాయి తలుపులు.

'అయితే లోపల ఎవరో ఉన్నారన్న మాట' అనుకొని తలుపు తట్టాడు రావ్.

రెండు నిమిషాల తరవాత తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా ఉన్న వ్యక్తిని చూశాడు రావ్—"మీరు..." అంటూ ఆగాడు.

"నన్ను సురేంద్ర అంటారు. మీరెవరు?" అడిగాడు అతను.

"నా పేరు రావ్—నీరజకు వరుసకు అన్న నవుతాను." ఆ సమయంలో అలా మాట్లాడక తప్పింది కాదు.

"లోపలికి రండి." ఆహ్వానించాడు సురేంద్ర.

లోపలికి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు.

"నీరజ అన్ని విషయాలూ నాకు ఉత్తరంలో వ్రాసింది. మీరు చేసిన పనికి సిగ్గుతో మా కెవ్వరికీ మొహం చూపించలేకపోయింది" అన్నాడు రావ్.

"రావ్‌గారూ! నన్ను క్షమించండి. ఆవేశంలో విచక్షణా జ్ఞానం కోల్పోయిన మూర్ఖుణ్ణి. వయసు కొలిమిని వాతావరణం రెచ్చగొడుతుంటే నిలవలేకపోయాను. నేను చేసిన పనికి నాకు ఎటువంటి శిక్ష వేసినా ఫరవాలేదు కాని, నా బాధంతా నీరజ గురించే!" అన్నాడు సురేంద్ర కిటికీ దగ్గర నిలబడి.

రావ్ అవాక్కయి పోయాడు.

సురేంద్ర ఇలా మాట్లాడతాడని అత నూహించ లేదు. నీరజ కోసం ఇలా బాధ పడతాడని అనుకోలేదు.

సురేంద్ర మళ్ళీ తనే అన్నాడు: "ఆ రోజు నీరజ నా చేత పరాభవం పొందిన మర్నాటినుంచి నాకు కనిపించ లేదు. ఆమె ఎక్కడున్నా కనిపిస్తుందేమో ఆమెకు నా క్షమాపణలు చెప్పుకుందా మనుకున్నాను. కాని, ఆ మర్నాటి నుంచీ కనిపించలేదు. చాలా రోజులు ఎదురు చూశాను. ఆఖరుకి ఒకనాడు ఉండబట్ట లేక ఆమె క్లాస్‌మేట్ లలితను అడిగాను. పదిహేను రోజుల క్రితమే ఏదో ఊరు వెళ్ళిందని చెప్పింది. నేను నీరసపడి పోయాను. తరవాత పదిహేను రోజులకు లలిత చెప్పింది—ఆ క్రితం రోజే వచ్చి మళ్ళీ ఎక్కడికో వెళ్ళిపోయిందని, వాళ్ళింట్లో అంతా బాధరా పడుతున్నారని చెప్పింది. నా గుండెను ఎవరో పిండి నట్లయింది. నీరజ నా వల్ల నాశన మయింది. కాని, నే నామెను నాశనం చేయాలని అనుకోలేదు.

నీరజ కనిపిస్తే నన్ను క్షమించమని కోరేవాణ్ణి. ఆమె కిష్టమయితే ఆమెను పెళ్ళి చేసుకొని రక్షణ కల్పించేవాణ్ణి. కాని, నీరజ నా కంటికి మళ్ళీ కనిపించ లేదు. నన్ను నీచంగా ఊహించుకొని ఉంటుంది.

నా ముఖం జీవితంలో ఇక చూడదు. నన్ను విపరీతంగా అసహ్యించుకుంటుంది. నే నది భరించలేను. నా వల్ల నీరజకు అన్యాయం జరిగింది. కనుక ఆమె సుఖం కోసం పాటు పడాల్సిన బాధ్యత నా కుంది కానీ అందుకు అవకాశం లేదు. ఆమెను నాశనం చేసిన పాపిని. నా పాపాలకు ప్రాయశ్చిత్తం లేదు" అని చేతుల్లో ముఖం దాచుకొని ఏడవసాగాడు.



ముక్కుకు సూటిగా ... చిత్రం — సారథి (మద్రాసు-44)

రావ్‌కి సురేంద్రన్నై జాలి వేసింది. లేచి అతని దగ్గరగా వచ్చాడు.

"సురేంద్రగారూ! మనం నిమిత్త మాత్రులం. మనం చేయగలిగిందేమీ లేదు. భగవంతుడే మన కష్టాల్ని గట్టెక్కించాలి. బాధపడి ప్రయోజనం లేదు.

మీ బాధ చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది. నీరజ ఎక్కడ ఉందో మన కెవ్వరికీ తెలియదు. కాని, మనం ప్రయత్నిస్తే ఫలితం దక్కక పోదు. నీరజ తన రూపం, పేరు మార్చుకొని ఉంటుంది. అయినా, గుర్తు పట్టడం పెద్ద కష్టం కాదు. ఆమె తానంత తానుగా ఇక్కడకు రావలసిందే! ఎందు కంటే అస లీ భారతదేశంలో ఉందో లేక ఇంకెక్కడికైనా వెళ్ళిపోయిందో మనకి తెలియదు.

నీరజ ఎప్పటికైనా ఇక్కడకు వస్తుంది. అంతవరకూ మనం చేయ గలిగిందేమీ లేదు" అన్నాడు రావ్.

"అంతేనంటారా? నీరజ కోసం ఎదురుచూస్తూ ఈ జీవితం గడపవలసిం దేనా?" నిస్పృహగా అడిగాడు సురేంద్ర.

"తప్పదు. అంతకంటే చేయగలిగిం దేమీలేదు. కాని, మనం ధైర్యంగా ఉండాలి. పరిపూర్ణమైన ఆత్మవిశ్వా సంతో రోజులు గడపాలి. ఇవ్వాళ రాక పోయినా, రేపైనా నీరజ వస్తుందనే విశ్వాసంతో ఉండాలి" అన్నాడు రావ్.

"*మానవుడు జీవితంలో తెలియక* చేసే చిన్న తప్పు ఎన్ని అనర్థాలకు దారి తీస్తుందో ఇప్పు డర్థ మౌతూంది" అన్నాడు సురేంద్ర.

"సురేంద్రగారూ! మన మీ వేదాంత ధోరణి మానాలి. మాటలు చెప్పడంకాక చేతలు చూపించాలి. ఈ సనాతన ఆచారాల్ని కట్టిపెట్టి నవ చైతన్యంతో ముందుకు నడవాలి. నూతన శకానికి పునాదులు వెయ్యాలి. స్త్రీని గౌరవించడం నేర్చుకోవాలి. అందుకు మన లాటి యువకులు నూతనోత్సాహంతో ముందంజ వెయ్యాలి" అన్నాడు రావ్ ఆవేశంగా.

సురేంద్ర మాట్లాడకుండా ఊరు కున్నాడు.

"నీరజ కోసం మనం ఎదురుచూద్దాం. *నీరజ బాగు కోసం పాటు పడదాం. ఓ* స్త్రీకి అన్యాయం జరక్కుండా చూద్దాం."

"వస్తా గుడ్‌బై! మళ్ళీ రేపు కలుస్తాను" అని బయటకు వచ్చాడు రావ్.

ఎలాగైనా సరే నీరజనూ, సురేంద్రనూ ఒకటి చేయాలన్న ఆలోచన తప్ప ఇంకొకటి లేదు అతని మనస్సులో. కాని, ఎప్పుడో జరిగిన కారు ప్రమాదంలో నీరజ మరణించిందన్న విషయం అతనికి గాని, వేరెవరికి గాని తెలియదు. అతని ఆశయాలూ, ఆదర్శాలూ ఎందుకూ పనికి రావన్న విషయం అతనికి తెలియదు. అందమైన పువ్వులాటి నీరజ రాలిపోయిం దన్న విషయం ఇక ముందెన్నడూ ఎవ్వరికీ తెలిసే అవకాశం లేదని అతనికి *తెలియదు. పురుషుని కాముకత్వానికి* నీరజ బలిపశువులా బలి అయిపోయిందని కూడా అతనికి తెలియదు. ★